క్లుప్తంగా

యూరియా కోసం బారులు



చెన్నారావుపేట : యూరియా కోసం రైతులు బారులుదీరారు. మండల కేంద్రంలోని సొసైటీ ఎరువుల షాపునకు యూరియా వచ్చిందనే సమాచారంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. సోమవారం 1,000కి పైగా బస్తాలు విక్రయించినట్లు సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, సీఈఓ రవి తెలిపారు.

సర్టిఫికెట్ల అందజేత



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్‌లోని ధర్మారంలో సొసైటీ ఫర్ లక్ష్యం సోషల్ ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ ట్రెయినింగ్‌ను ఇటీవల నిర్వహించారు. కాగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం నాబార్డ్ అధికారులు, బీఆర్‌ఎస్ లీడర్ సుంకరి శివ సర్టిఫికెట్లు అందజేశారు.

నిరంతర విద్యుత్ అందించాలి



వర్ధన్నపేట: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటల పాటు అందించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బోంపెల్లి దేవేందర్‌రావు డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనల్లో భాగంగా సోమవారం వర్ధన్నపేట విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వర్ధన్నపేట అంబేడ్కర్ సెంటర్ వద్ద వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో అరగంటపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సందర్భంగా దేవేందర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్నా.. అప్రకటిత కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో నీరందక ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



నర్సంపేట రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ బీసీల రిజర్వేషన్ 27నుంచి 52శాతానికి పెంచాలని కోరుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమేరకు సోమవారం బీఎస్పీ నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ పట్టణంలో సంతకాల సేకరణ చేపట్టారు. బుర్రి సాగర్, శీరంశెట్టి రాజేందర్, రాజ్ కుమార్, వెంకన్న, రాజు, వైనాల కుమారస్వామి, యాదగిరి, సమ్మయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నల్లబెల్లి : నేటి నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు తాండ్ర కుమార్ ప్రథమ వర్ధంతి సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి దామ సాంబయ్య అన్నారు. అనంతరం ఈ మేరకు ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మార్తా నాగరాజు, సమ్మయ్య, మల్లయ్య, సాంబయ్య, బాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం



నర్సంపేట రూరల్ : హార్ట్ బీట్ ఫౌండేషన్ నిర్వాహకులకు మండలంలోని లక్నేపల్లి శివారు బాలాజీ టెక్నో స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు సంయుక్తంగా రూ. 1,05,516లు బిట్స్ కళాశాల కన్వీనర్ డాక్టర్ ఏ.వనజ సోమవారం అందించారు. పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఫౌండేషన్ వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘డబుల్ బెడ్రూం’ కల నెరవేరేనా?

- దాత స్థలం కొనుగోలు చేసి అందించినా.. నిర్మాణంలో జాప్యం..
- ఇళ్లు నిర్మించడం లేదంటూ గుడిసెలు వేసిన పేదలు
- వాటిని తొలగించిన అధికారులు



డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం కొనుగోలు చేసిన స్థలం

నర్సంపేట రూరల్ : ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిర్మించిన ఇంట్లో రెండు గదులే ఉన్నాయని, దీంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో గత పాలకులను విమర్శించింది.. పేదల కోసం డబుల్ బెడ్రూం ఇళ్లు సుమారు రూ. 5లక్షలతో నిర్మించి అందిస్తామని గొప్పలు చెప్పింది. దీంతో ప్రజలు డబుల్ బెడ్రూం ఇళ్ల వస్తాయని ఆశలు పెట్టుకున్నారు. అప్పుడే నియోజకవర్గంలో పేదల కోసం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలంటే స్థలం లేదని ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ఆ స్కీంకు బ్రేకులు పడినట్లు అయింది. సివిల్ సప్లై చైర్మన్‌గా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎన్నికైన తర్వాత దాత ప్రముఖ వ్యాపారి దొడ్డ మోహన్‌రావుతో మాట్లాడి పేదల ఇళ్ల కోసం 2017లో 19.37ఎకరాల భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వానికి అందించారు. ఈ భూమిలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పి అప్పట్లో 960 ఇళ్లను మంజూరు చేసినట్లు అప్పటి కలెక్టర్ ఆధ్వర్యంలో జీఓను కూడా జారీ చేశారు. మూడుసార్లు ఇళ్లు మంజూరయ్యాయని, నిధులు ల్యాప్స్ కూడా జరిగాయే తప్పా ఒక్క ఇళ్లు కూడా నిర్మించిన దాఖలాలు లేవన్నారు. చివరకు ఆ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు క్రషర్ మిల్లర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. దాదాపు రెండు సంవత్సరాలపాటు ఆ ప్లాంట్ కొనసాగింది. దీంతో పేదలు ఆ స్థలంలో గుడిసెలు వేయడంతో వెంటనే ఆ మిల్లర్ ప్లాంట్‌ను తొలగించారు. ఇంతలో నర్సంపేటకు జిల్లా ఆస్పత్రి మంజూరు కావడంతో ఆ భూమిలో నిర్మిస్తామని ప్రతిపాదనలు పంపి 10ఎకరాల భూమిని కేటాయించి పనులు సైతం ప్రారంభించారు. ఎంసీపీఐ(యూ)పార్టీ ఆధ్వర్యంలో పలుమార్లు గుడిసెలు వేశారు. దీంతో ప్రజలపై, నాయకులపై పలుమార్లు కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. ఏది ఏమైనప్పటికి పేదల కోసం కొనుగోలు చేసి ఇచ్చిన భూమిలో మాత్రం ఒక్క ఇళ్లు కూడా నిర్మించకుండా పేదలను వంచించారని విమర్శలు మాత్రం వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా మిగిలిన భూమిని అర్హులైన నిరుపేదలకు పట్టాలు అందించి ఇళ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

మిగులు భూమిని పంచాలి



డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం వ్యాపార వేత్త దొడ్డ మోహన్‌రావు 19.37 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇచ్చారు. ఆ భూమిలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి, నేడు ఆ హామీని విస్మరించారు. జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి 10ఎకరాలు కేటాయించడాన్ని మేము స్వాగతిస్తున్నాం. మిగులు భూమిలోనైనా అర్హులైన పేదలకు పట్టాలు ఇప్పించి ఇళ్లను మంజూరు చేయాలి.

– వంగాల రాగసుధ, ఎంసీపీఐ(యూ) నాయకులు

మాటలతో కాలయాపన



రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్ల స్కీం ఎత్తేసి డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం తీసుకొచ్చారు. నియోజకవర్గంలో ఒక్క ఇళ్ల కూడా నిర్మించలేదు. పైగా పలుమార్లు నిధులు తెచ్చాం, త్వరలో ప్రారంభిస్తామని ప్రకటనలు చేశారే తప్పా పునాది వేయకలేకపోయారు. మాటలగారడితో ప్రజలను మోసం చేస్తున్నారే తప్పా ప్రజలకు ఒరిగిందేమి లేదు. ఇప్పటికైనా పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలి.

– పెండెం రామానంద్, కాంగ్రెస్ నాయకుడు

మోదీతో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం



ఎస్‌బీఐ ఎదుట ధర్నాచేస్తున్న సీపీఐ నాయకులు

నర్సంపేట రూరల్ : దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న ప్రధాని మోదీ అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా నర్సంపేట ఎస్‌బీఐ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అదానీ అవినీతిని నిర్మూలించకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణించి దేశ భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. తక్షణమే అదాని గ్రూప్ ఆస్తులన్నీ వేలం వేసి దేశాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం యాకయ్య, కవిత, యాకుబ్, నాగరాజు, సతీష్, స్వామి, రవి, పాషా, మమత, శైలజ, మంజుల, సోని, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

పుష్కలంగా రెండు పంటలు

నర్సంపేట రూరల్ : ఒక్క పంటకే నమ్మకం లేని రోజుల నుంచి రెండు పంటలు పుష్కలంగా పండించే స్థాయికి వ్యవసాయ వృద్ధి జరగడం గర్వనీయమని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో మాట్లాడిన పలు అంశాలను సోమవారం ఆయన నర్సంపేటలో వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత వ్యవసాయాభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ.8వేల కోట్లు మాత్రమే కాగా.. రాష్ట్ర అవతరణ తర్వాత నేడు అదే వ్యవసాయ రంగానికి మొత్తం రూ.1.92లక్షల కోట్లు కేటాయించిన సీఎం కేసీఆర్ ఈ ప్రాంత రైతులపై ప్రేమ, ఆదరాభిమానాలు చాటారన్నారు. 2014–15లో ధాన్యం దిగుబడి కేవలం 68 లక్షల మెట్రిక్ టన్నులే కాగా.. 2021–22 నాటికి 2.24 కోట్ల మెట్రిక్ టన్నులకు దిగుబడి పెరిగిందన్నారు.

రైతులకు మోటార్లు అందిస్తాం

రైతాంగానికి సబ్సిడీపై మోటర్ల పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని, డీడీ తీసిన ప్రతి రైతులకు త్వరలోనే మోటార్లను అందించడం జరుగుతుందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నర్సంపేట క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరెంట్ మోటార్ల సబ్సిడీ పథకంపై ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుంది, రైతులు మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు.

ఇటుకబట్టీ కార్మికులకు వేతనాలు పెంచాలి



ఆర్డీఓ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : ఇటుకబట్టీ కార్మికులకు వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అరెపల్లి కృష్ణ అన్నారు. ఈ మేరకు నర్సంపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ, కార్మికులకు ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ధర్నా చేసి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుకబట్టీలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యాలు దోపిడికి గురిచేస్తున్నాయని, తక్షణమే వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బరిగెల కుమార్, రాజేందర్, నర్సయ్య, కొమురయ్య, సురేష్, సమ్మయ్య, జనార్దన్, రమక్క, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అభివృద్ధికి కృషి చేయాలి

చెన్నారావుపేట : గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎంపీఓ శ్రీధర్, సర్పంచ్ అనుముల కుమారస్వామి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఖాదర్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

గీసుకొండ / నర్సంపేట రూరల్ :గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ గరీభ్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. అలాగే నర్సంపేట మండలంలోని పాతముగ్దుంపురంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ మోతె కళావతి, జెడ్పీటీసీ కోమాండ్ల జయగోపాల్ రెడ్డి ప్రారంభించారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని ఏనుగల్ గ్రామానికి కాకతీయ కాల్వ ద్వారా రావాల్సిన నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఇరిగేషన్ ఎస్‌ఈకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తక్కళ్లపల్లి భాస్కర్‌రావు, గూడ నరేందర్‌వర్మ మాట్లాడుతూ.. కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి రైతులకు సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

రాయపర్తి : మండల పరిషత్ కార్యాలయంలో నేడు (మంగళవారం) మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిషన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సకాలంలో శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

చర్య తీసుకోవాలి

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి ఏబీఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు బొట్ల నరేష్, ప్రశాంత్, శరత్ అన్నారు. ఈ మేరకు కలెక్టర్ గోపికి విద్యార్థిసంఘాల నాయకులు వినతిపత్రం అందించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సంగెం : జీపీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీఆర్ ఈఈ శంకరయ్య అన్నారు. సోమవారం మండలంలోని గవిచర్ల గ్రామ పంచాయతీ భవన నిర్మాణ స్లాబ్ పనులను సందర్శించి పరిశీలించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సంగెం : మండలంలోని నల్లబెల్లిలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కళావతి సోమవారం ప్రారంభించారు.

ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా



వరంగల్ (పర్వతగిరి) : పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి భరోసాగా నిలుస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన ఎదురుగట్ల సమ్మక్కకు రూ.2.50లక్షల ఎల్‌ఓసీ సోమవారం అందజేశారు.

ఆర్థికసాయం

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మేడిద మల్లయ్య తల్లి నర్సమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పరామర్శించి రూ.25వేల సాయాన్ని అందజేశారు.

పరామర్శ

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని రోళ్లకల్ పరిధిలోని సాధ్యతండాకు చెందిన మూడు శ్రీను, టీక్యా, రక్కి అనారోగ్యంతో బాధపడుతుండగా సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పండ్ల పంపిణీ చేశారు. సేవాలాల్ యూత్ అధ్యక్షుడు ప్రతాప్, బాలకృష్ణ, రవి, వెంకన్న, అనిల్, సంతోష్, వినోద్, బాలాజీ, అశోక్ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామకార్యదర్శి శ్యాంపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపి ఎంపీడీఓకు పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందించారు.

అధికారులకు సన్మానం

గీసుకొండ /దుగ్గొండి : గీసుకొండ మండలం నుంచి ఖమ్మం జిల్లా వేంసూరుకు బదిలీ అయిన ఎంపీడీఓ గద్దం రమేశ్, నెక్కొండ కార్యాలయ సూపరింటెండెంట్ వడ్లూరి ప్రవీణ్‌కుమార్, హన్మకొండ జిల్లా చిల్పూరుకు బదిలీ అయిన ఏపీఓ మోహన్‌రావును అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అలాగే దుగ్గొండి మండలంలోని చలపర్తి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సంతోష్ బదిలీపై కేశవాపురం వెళ్లారు. ఈమేరకు సంతోష్‌ను గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు.

కేజ్‌వీల్స్ ట్రాక్టర్ యజమానికి జరిమానా

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లిలో రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ సోమవారం రూ.1,000 జరిమానా విధించారు.

కేసు నమోదు

చెన్నారావుపేట: దాడులు చేసుకున్న ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. చెన్నారావుపేట మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన చిందం విజయ్ ఇంటిపైకి ఇదే గ్రామానికి చెందిన బూర్గు రాజేందర్, రాజశేఖర్, చిన్న సూరయ్యలు కర్రలతో దాడులు చేయడానికి ఆదివారం రాత్రి వచ్చారు. బూతులు తిడుతూ విజయ్‌ని కర్రతో తలపై కొట్టడంతో తను కత్తిపీట తీసుకోని దాడి చేశాడు. దీంతో రాజేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని తురుకల సోమారం గ్రామంలోని బాబా చిల్లా హజ్రత్ మాషుక్–ఏ–రబ్బాని ఉర్సు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో సోమవారం ప్రారంభం కాగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలోని మసీదు నుంచి గంధంను వేడుకగా తీసుకుని వెళ్లి గుట్టపైన రబ్బాని బాబాకు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వార్షికోత్సవ పూజలు

ఖానాపురం : మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 5గంటల నుంచి హోమం చేశారు.

సంతాపం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాధన్నపేట గ్రామానికి చెందిన ఎంసీపీఐ(యూ) సీనియర్ నాయకుడు గిరబోయిన ఎల్లస్వామి అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో సోమవారం మృతిచెందాడు. ఆయన మృతదేహంపై ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగాల రాగసుధ,జిల్లా కమిటీ సభ్యులు కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందంలో పార్టీ జెండాను కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లలకు కంటి పరీక్షలు చేయాలి

- చేసిన పనులకు బిల్లులు చెల్లించాలి
- మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం



సభలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు

గీసుకొండ : పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు చేయాలి. అవసరమైన వారికి చికిత్సలు అందించాలని గీసుకొండ మండల సభ తీర్మానించింది. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బీమగాని సౌజన్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం బిల్లులను మంజూరు చేయడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో రోడ్డు వెడల్పులో భాగంగా నష్టపరిహారం కింద మంజూరైన డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు చెల్లించాలన్నారు. వ్యవసాయానికి రాత్రి పూట కరెంటు ఇస్తున్నారని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. మిషన్ భగీరథ పనులు చేసిన నాలుగేళ్ల నుంచి బిల్లులు రాకపోవడంతో సొంత భూములు అమ్ముకుంటున్నారని, ధరణిలో సవరణలు చేసే అవకాశం ఉండాలని జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు అన్నారు. కొమ్మాల జాతర వచ్చే నెలలో ఉండటంతో సూర్యతండా వద్ద నీటి వసతి కల్పించాలని ఎంపీటీసీ గోపాల్ కోరగా, కొనాయమాకులలో బ్రాంచ్ పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేయాలని కోఆప్షన్ సభ్యుడు రహీం అధికారులను కోరారు. ఎంపీడీఓ వీరేశం, వైస్ ఎంపీపీ రడం శ్రావ్య, సర్పంచ్‌లు గోనె మల్లారెడ్డి, పూండ్రు జయపాల్‌రెడ్డి, అంకతి నాగేశ్వర్ రావు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనకు కృషి

సాక్షి ఎఫెక్ట్..



వివరాలు తెలుసుకుంటున్న ప్రకాష్

చెన్నారావుపేట : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ అన్నారు. పీహెచ్‌సీలో సిబ్బంది కొరత, అసౌకర్యాలతో సిబ్బంది ఇబ్బందులు పడుతుండటంతో సర్కారు ఆస్పత్రిలో సౌకర్యాలు నిల్ వార్త కథనం సాక్షిలో సోమవారం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ప్రకాష్ ఆస్పత్రిని సందర్శించి పరిస్థితులు డాక్టర్ సరోజను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. వెంటనే కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఆస్పత్రి డెవలప్‌మెంట్ ఫండ్ నిధుల ద్వారా పనులు చేయించాలని సూచించారు. అలాగే ఎన్‌హెచ్‌ఎం ద్వారా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని వెంటనే పనులు ప్రారంభిస్తామని అన్నారు. సిబ్బంది నియామకంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు పలు సూచనలు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. బోధకాలు, వ్యాధిగ్రస్తులకు కిట్లు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రేమలత, స్టాఫ్ నర్స్ స్వరూపరాణి, సిబ్బంది ఉన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రత్నమాల

చెన్నారావుపేట : పదో తరగతిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ రత్నమాల అన్నారు. ఈ మేరకు మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో సోమవారం జల్లీ, పాపయ్యపేట కాంప్లెక్స్ పరిధిలోని హైస్కూల్ విద్యార్థులకు పదో తరగతి పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదోతరగతి పరీక్షలు సులభంగా రాసే పద్ధతులపై వివరించారు. ప్రతి సబ్జెక్టుకు ఒక్క పేపర్ ఉన్నదని అన్ని ప్రశ్నలకు సమాధానం రాసే విధంగా ప్రిపేర్ కావాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎంలు సరళ, పాపమ్మ, రజిని, రిసోర్స్ పర్సన్లు ప్రసన్నలక్ష్మీ, శేఖర్, రవికిషోర్, వీరబాబు, రవి, పరమేశ్వర్, జగన్ మోహన్, బాలాజీరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

‘మాయమాటల మోసగాడు కేసీఆర్’



మాట్లాడుతున్న రేవూరి ప్రకాష్‌రెడ్డి

దుగ్గొండి : మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టి పాలన చేయడంలో కేసీఆర్‌ను మించిన మోసగాడు ఎక్కడ ఉండరని బీజేపీ రాష్ట్ర నాయకుడు రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని చలపర్తి గ్రామంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2017 ఏప్రిల్ 13న రైతులందరికి ఉచిత ఎరువులు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని విమర్శించారు. 24 గంటల పాటు కరెంట్ ఇస్తామని చెబుతున్న పాలకులు కనీసం 8 గంటలయినా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ పాలకులు గొప్పలు చెప్పుకోవడమానుకుని కనీసం 12 గంటలయినా కరెంట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వడ్డెపల్లి నర్సింహారాములు, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు నల్లబెల్లి సుదర్శన్, చుక్క రమేష్, మాచర్ల దేవేందర్, పెంచాల సతీష్, మోకిడె ప్రభాకర్, ఏరుకొండ కరుణాకర్, బొల్లెపల్లి రాము, కృష్ణ, నల్ల రవీందర్, కొలగాని రవి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల మాటల యుద్ధం

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని చౌటపల్లి గ్రామంలో బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రజాగోస–బీజేపీ భరోసా యాత్రలో భాగంగా కార్నర్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి బీజేపీ మండల ఇన్‌చార్జ్ బండ ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, చౌటపల్లి ఇన్‌చార్జ్ శెట్టి సోమన్న, బీజేపీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, వినోద్, సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ మాటలు నియంత పాలనకు నిదర్శనం



గీత కార్మికులతో మాట్లాడుతున్న మాధవరెడ్డి



గీసుకొండ : ఆరెపల్లిలో..

చెన్నారావుపేట : రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలన కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మాధవరెడ్డి చేపట్టిన పాదయాత్ర మండలంలోని జీడిగడ్డ తండా, ఉప్పరపల్లి, కాల్‌నాయక్‌తండా మీదుగా కోనాపురం చేరుకుంది. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కూలీలు, గీతకార్మికులు, రైతులు, దివ్యాంగులతో మాట కలిపి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండండి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధైర్యం చెప్పారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తొమ్మిది సంవత్సరాల పాలనలో నాలుగు లక్షల కోట్ల అప్పుల భారాన్ని తెలంగాణ ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేరలేదని, పిట్టల దొర మాటలకు మోసపోవద్దని అన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. ఏకకాలంలో రుణమాఫీ చేయడం, వడ్డీలేని రుణాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. యాత్రలో గ్రామ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, నియోజకవర్గ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కేసీఆర్‌వి మోసపూరిత వాగ్దానాలు

గీసుకొండ : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మొద్దని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఆరెపల్లిలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం చేపట్టారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీపీ బీమగాని సౌజన్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు కొండేటి కొమురారెడ్డి, చాడ కొమురారెడ్డి, అశోక్‌రెడ్డి, దేవేందర్‌రావు, నాగపూరి స్వామి, ఎంపీటీసీలు కాగిత భిక్షపతి, గోపాల్, శ్రీను, రుద్రప్రసాద్, ఎలగొండ ప్రవీణ్, దుపాకి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జోడోయాత్రను విజయవంతం చేయాలి

వర్ధన్నపేట : టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టబోయే హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఈనెల 16న వర్ధన్నపేటకు చేరుకుంటున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు కోరారు. సోమవారం వర్ధన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16న వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయానికి చేసుకుని అక్కడ పూజా కార్యక్రమాలు చేసుకుని యాత్ర ప్రారంభమవుతుందన్నారు. యాత్ర ఐనవోలు నుంచి పెరుమాండ్లగూడెం, పంథిని, కట్ర్యాల, ఇల్లంద గ్రామాల మీదుగా వర్ధన్నపేటకు చేరుకుంటుందన్నారు. అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడతారని తెలిపారు. సమావేశంలో నాయకులు నరుకుడు వెంకటయ్య, సమ్మెట సుధీర్, గుజ్జ రవీందర్‌రెడ్డి, ఎండీ.అక్బర్, చిన్న తదితరులు పాల్గొన్నారు. కాగా.. పట్టణంలో రేవంత్‌రెడ్డి బహిరంగ సభ కోసం సోమవారం ఆయన నేతృత్వంలోని బృందం స్థల పరిశీలన చేసింది. కార్యక్రమంలో ఎండీ.అప్సర్, బాలకృష్ణ, తాళ్లపెల్లి శ్రీనివాస్, నిమ్మనబోయిన పైడి పాల్గొన్నారు.